

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**నేను దిగ్గున తలెత్తి** చూసాను. నా ఇంటి విషయాలు అన్నీ చెప్పి ఇతనికి చులకన అయ్యానా అని.

ద్వారక చెప్తున్నాడు "నువ్వు పాడే పాటలు, మాట్లాడే సినిమాల సంగతులు. అన్నీ మీ అమ్మ చిన్నప్పుడివే. చూసావా నీ ఈడువాళ్ళు ఫాలో అయ్యే సినిమాలూ, ఇన్‌స్టాలో రీల్స్.. రిషీ నువ్వు ఎక్కడో ఆగిపోయావ్. భావుకత్వం, నీ సాహిత్యం అన్నీ నిన్నటి తరానివే. అయినా నీ అమాయకత్వం నాకు చాలా నచ్చి ఇష్టపడ్డాను. మీ అమ్మని రోజుకి ఇరవైసార్లు విమర్శించే నువ్వు ఆమెకన్నా ఎందులో వేరు చెప్పు? ఆమె భర్తనుండి ఆశించినవేగా నువ్వూ ఆశిస్తున్నావ్. మీ పెద్దమ్మలా నగలూ, ఆస్తులూ, అంతస్తులూ ఒక సెక్యూరిటీ.. అది మొగుడిద్వారా. అంతే కానీ నిన్నటి ఆ తరానికీ నీకూ ఏమిటి తేడా? నీ కాళ్ళమీద నువ్వు నిలబడడానికి ఏమైనా ట్రై చేసావా? నువ్వు డిఫరెంట్‌గా ఆలోచిస్తున్నా అనుకుంటూ మళ్ళీ ఆ చట్రంలోంచి బయటకి రావడం లేదు. కంఫర్ట్స్ ఇండివిద్యుయాలిటీ, కత్తికి రెండు ఎడ్జెస్.. రెండు వైపులా పదునుండాలి అంటే, చాలా రాపిడి పడాలి. పెళ్ళి జీవితానికి పరమావధి అనుకుంటే అమ్మా నాన్నా చూసిన వాడినే పెళ్ళి చేసుకుని, వాళ్ళు చెప్పినట్లు వినాలి. లేదా..."

"థాంక్స్" లేచి నిలబడ్డాను.

నువ్వు నిన్నటి తరం పాత చింతకాయపచ్చడివి. పేరేకాదు నీ ఆలోచనలు కూడా అంటున్న అతని మొహం చూడాలనిపించలేదు. అతని సామీప్యం నాకు అవసరంలేదు. ఇంత ఇన్‌సల్ట్ చేసాక ఇతనితో జీవితం కూడా నాకు అక్కరలేదు అనిపించింది.

"రిషీ! ప్లీజ్ తొందరపడకు" అన్నాడు.

"పదతా నాకు అన్నిటికీ తొందరే. అందుకే నువ్వు కనిపించగానే, ఎలాంటి వాడివో తెలుసుకోకుండా, వెనకా ముందూ ఆలోచించకుండా నీతో ప్రేమలో పడ్డాను. అంతటితో ఆగక ఇంకా ముందుకి వెళ్ళి నీకు నా..."ఛీ" ఆగిపోయాను.

"రిషీ! ఎమోషనల్ అవకు. నేనేం చెప్తున్నానో అర్థం చేసుకో"

"ఎమోషన్స్ అంటే నీకు తెలుసా? అసలు మీ కుటుంబంలో ఆ ఎమోషన్స్ లేకేగా ఇలా ఎవరికి వాళ్ళు విడివిడిగా బ్రతుకుతున్నారు. ఎవరూ ఎవరిమీదా డిపెండెంట్స్ కారు. అసలు అందుకే అమ్మ అంటుంది, పెళ్ళి అంటే ముందు కుటుంబాన్నీ, వంశాన్నీ చూడాలని.."

అతని మొహం ఎర్రబడింది. సీరియస్ గా చూసాడు. పూనకం వచ్చినట్లు మాట్లాడ్తున్న నేను ఆగిపోయాను. అతని వీక్ పాయింట్ మీద కొట్టాను. అతను దేనికి భయపడుతున్నాడో ఆ సున్నితమైన గాయం మీద సూదుల్లాంటి మాటలతో గుచ్చాను. చెప్పలేనంత సిగ్గేసింది నా తొందరపాటుకి. బట్.. జరిగిపోయింది.. నోరు జారాక వెనక్కి తీసుకోలేం. "సారీ" అన్నాను.

అతను నవ్వాడు. "పద డిన్నర్ చేద్దాం" అన్నాడు.

నేను నమ్మలేనట్లు చూసాను. నేనింతమాట అన్నాక, ఏం జరగనట్లు డిన్నర్ చేద్దాం అంటున్నాడేంటీ? తర్వాత చెయ్యి కలిపి "బై.. నీకూ నాకూ కుదరదు" అనడానికేనా? అనిపించింది.

"కం" అతను కదులుతుంటే అనుసరించాను. రెస్టారెంట్‌లో ఎదురెదురుగా కూర్చున్నాం.

అతని మాటల్లాగే, అతను ఆర్డర్ ఇచ్చిన డిషెష్ కూడా పెద్దగా అర్థం కాలేదు.

"మీ డాడీకి హార్ట్‌లో స్టంట్ వేసారన్నావ్? ఎలా వుందీ?" నాకు ఫుడ్ సర్వ్ చేస్తూ అడిగాడు.

"చాలా త్వరగా అడిగావ్" హేళనగా అన్నాను.

"సారీ.. నాకు ఫార్మాలిటీస్ పెద్దగా తెలీవు" అన్నాడు.

బ్రోకలీ సూప్ తాగుతూ "ఎమోషన్స్‌కీ ఫార్మాలిటీస్‌కీ తేడా కూడా తెలీదు" అన్నాను.

"అవును"అన్నాడు.

కోపంగా అన్నాడో లేక ఒప్పుకుంటున్నాడో కూడా తెలియలేదు. విచిత్రమైన మనిషి.

"ఇంత సడెన్‌గా ఇండియా ఎందుకొచ్చావ్?" అడిగాను.

"నాన్నకి ఏక్సిడెంట్ అయింది. కాలు ఫ్రాక్చర్ అయింది. వెళ్తున్న ఆటో కాలవలో బోర్లాపడింది అని వినగానే వచ్చాను. ఎమోషనల్ అయి కాదు. బాధ్యత అని" నవ్వాడు.

ఛెళ్ళున చెంప మీద కొట్టినట్లయింది.

అతనివైపు నుండి ఆలోచించకుండా ఎందుకొచ్చావ్ అని కూడా అనకుండా, ఇన్ని మాటలు అనేసానే అని సిగ్గేసింది.

"సారీ.. ఈ విషయం నాతో కమ్యునికేట్ చెయ్యాలనిపించలేదా?" అడిగాను.

"నా జవాబు నువ్వు తట్టుకోలేవు ముందు భోంచెయ్యి" అనాడు.

"చెప్పాల్సిందే" అన్నాను స్పూన్ వదిలేసి.

"నా ప్రతి కష్టం, ప్రతి విషయం నీకు చెప్పడం అలవాటు అయిపోతే నీలాగే నేనూ ఏదో ఒక రోజున నీకు నా మీద ఇంట్రెస్ట్ పోయినప్పుడు బాధపడాల్సొస్తుంది. అలా బాధపడడం నాకు ఇష్టంలేదు. లోకంలో ప్రేమలు అందుకే ఫెయిల్ అవుతాయి. మొదట్లో వున్న ఈ ఎమోషనల్ డిపెండెన్సీ పెరిగి, అవతలి వాళ్ళకి బోర్ కొట్టి, వాళ్ళు వినడం మానేసినా, విని ప్రతిస్పందించడం మానేసినా, మనం తట్టుకోలేం. ఇదివరకటి ప్రేమ నా మీద తగ్గిపోయింది.. మా కుక్కపిల్ల కాలు విరిగింది అని చెపితే.." అయ్యో నేను రానా?" అన్నావ్ అర్ధరాత్రి అని అయినా చూడకుండా మొదట్లో. ఇప్పుడు మా అమ్మకి స్ట్రోక్ వచ్చిందంటే "అంబులెన్స్‌ని పిలిచావా? నాతో మాట్లాడ్తూ కూర్చున్నావేంటి?" అంటున్నావే అని ఏడుస్తాం. ఆ పరిస్థితి నాకొద్దు. నా బాధలూ, నా సుఖాలూ నేనొక్కడినే అనుభవిస్తాను. నాన్న విషయం అమ్మతోకూడా చెప్పలేదు" అన్నాడు.

"టూ మచ్ కదా! మీ అమ్మకూడా పరాయేనా?" అన్నాను.

"పరాయిగా వుండడంలో ఆనందం వుంది అని విడిపోయిన వాళ్ళని ఎమోషనల్‌గా కట్టిపడేయాలనే స్టుపిడిటీ నాకు లేదు. వాళ్ళు వేరే వేరే జీవితాలు కల ఇద్దరు వ్యక్తులు. కామన్‌గా ఏమీలేదు. వుండకూడదు" అన్నాడు.

"చాలా వింతమనిషివి" అన్నాను.

"కష్టం రిషీ! నాతో కలిసి వుండడం చాలా కష్టం" అన్నాడు.

"ఇప్పుడు పెళ్ళికాదు. కలిసి వుండడం కష్టం అనే అభిప్రాయానికి వచ్చేసావా?" అడిగాను.

"నీకు ప్రాక్టికల్‌గా ఇది సంభవం అనిపిస్తోందా? ఈ భోజనం, ఆ వెస్ట్రన్ మ్యూజిక్.. నా థాట్స్ ఏవైనా నీకు నచ్చాయా? చెప్పు. మనసులో ఎన్నిసార్లు వీడు వింత పశువు అనుకున్నావ్?" అన్నాడు.

"బట్ ఐ స్టిల్ లవ్ యూ" ఆమాట అంటుంటే కన్నీళ్ళు ఆగలేదు నాకు.

"లవ్ చెయ్యడానికి ఒక రూఫ్ కింద బలవంతంగా ఖైదీల్లా బంధించబడక్కర్లేదు" అన్నాడు.

"అంటే? నేను నిన్ను ప్రేమిస్తూ నా మానాన నేను నా ఉద్యోగం నేను చేసుకుంటూ, నా ఇంట్లో నేను బ్రతికెయ్యాలా?" కోపంగా అడిగాను.

"లేక.. కలిసి బ్రతుకుతూ, పడక కొట్లాడుకుంటూ, కొన్నాళ్ళకి ద్వేషించుకుంటూ, అదే పెళ్ళయితే, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇలా వుండాలా? వీ ఆర్ లక్కీ.. మనకి భావజాలం సరిపోవట్లేదు అని ముందే తెలిసింది" అన్నాడు.

"యూ మీన్ దిసీజ్ పొలైట్ వే ఆఫ్ సేయింగ్ బ్రేకప్" అడిగాను.

"రిషీ మనం ఫ్రెండ్స్.. బ్రేకప్‌లాంటి పిచ్చి పదాలు మన మధ్యలో లేవు. ఆనందంగా వున్నావా? ఫోన్ చెయ్యి ఇద్దరం సరదాగా మాట్లాడుకుందాం. చూడాలని అనిపించిందా? చెప్పు ఇద్దరం కలిసి హాయిగా రెండురోజులు ఎటైనా వెళ్ళి ఎంజాయ్ చేద్దాం. ఏడుపొచ్చిందా ఏడ్చెయ్. అసహ్యం పుట్టిందా? పో అను. మళ్ళీ ప్రేమ పుట్టిందా? రా అను వచ్చేస్తా. ఎంత బావుంది చెప్పు. ఏవీ బైండింగ్స్ లేకుండా?" అన్నాడు.

"ఈలోగా ఫ్లయిట్‌లో నీకు ఇంకో అమ్మాయి, నాలా చింతకాయ పచ్చడికాకుండా, నీ భావాలకి తగ్గట్టుగా కనిపిస్తే ఆమె నీ కండిషన్స్‌కి ఒప్పుకుంటే, ఆమెతో లివింగ్ టు గెదర్ చేస్తూ, నేను పిలిస్తే వస్తావా? పెళ్ళీ పెటాకులూ వుండవు కానీ నాకు సవితి పోరు మాత్రం వుంటుందా?" అన్నాను.

ద్వారక నా మాటలకి బాగా నవ్వాడు. నాకు ఉక్రోషం వచ్చింది.

"నా ఏడుపు నీకు నవ్వు తెప్పిస్తోందా?" అన్నాను.

"నువ్వు భలే విట్టీగా మాట్లడ్తావ్. ఆ సెన్స్ ఆఫ్ హ్యూమర్ తక్కువమంది అమ్మాయిల్లో వుంటుంది. అందుకే నువ్వు నచ్చావు" అన్నాడు.

"నా ప్రశ్నలకి జవాబు ఇవ్వలేదు" అన్నాను.

"నీతో ఇష్టంలేనివాడిని, ఇంకొక అమ్మాయితో మాత్రం మళ్ళీ అలాంటి రిలేషన్‌లో ఎందుకు చిక్కుకుంటాను చెప్పు?" అన్నాడు.

"నాకేం తెలుసు? నేను అభద్రతాభావంతో రాత్రింబగళ్ళు కుమిలిపోతూ వుండాలా?" అన్నాను.

"కలిసి వుండి సమాజం, అమ్మా, నాన్న కోసం కుమిలిపోయి, విడిగా వుండి నేను ఎక్కడ ఎంజాయ్ చేస్తున్నానో అని ఊహించుకుని కుమిలిపోతూ అసలు నువ్వు కుమిలిపోకుండా వుండాలంటే ఏం చెయ్యాలో మొదట ఆలోచించుకురా తర్వాత మాట్లడదాం" అన్నాడు.

అతను పెదవులు బిగించి నవ్వుని అదిమి పెడ్తున్నాడని నాకు అర్ధమైంది.

"నీకు గొప్ప జోక్‌గా వుంది కదూ నా బతుకు" అన్నాను.

"నీకు మేరేజ్ ఇన్స్టిట్యూషన్ మీద నమ్మకం లేదు అనుకున్నాను. అసలు మనుషుల ప్రేమ మీద కూడా నమ్మకం లేదుకదూ. సెక్స్ అంటే చాలా కాజువల్‌గా ఇరానీ చాయ్ వన్ బై టు తాగి వెంటనే మరిచిపోయినట్టా నీ దృష్టిలో?" అన్నాను.

"కాదు" అన్నాడు.

ఇంకా ఏమైనా ఎలాబరేట్ చేసి చెప్తడేమో అని ఆశగా చూసాను.

ఏమీ చెప్పలేదు "మనం నా రూముకి వెళ్దామా? లేక నువ్వు ఒక్కదానివీ ఇంటికి వెళ్తావా?" అన్నాడు.

"నాకు జవాబు మాత్రం చెప్పవు కదూ"

"సెక్స్ అంటే ఏవిటి నీ దృష్టిలో అన్నావు. రూముకి వస్తే చెప్పడానికి ప్రయత్నిస్తా..."

అతను అల్లరిగా మాట్లాడడం చూస్తే, ఇదంతా నన్ను ఆటపట్టించడానికి చేస్తున్నాడేమో అనిపించింది.

"ద్వారకా నన్ను ఏడిపించకు. నాకు తెలియకుండా ఏక్సిడెంటల్‌గా నిన్ను గాఢంగా ప్రేమించేసాను. ఇప్పుడు వెనక్కి వెళ్ళలేను" అన్నాను.

"నువ్వు గంటలో మూడుసార్లు మనసు మార్చుకుంటావు. పోనీ కలిసి ఒక ఏడాది గడిపి చూద్దాం అంటే, నాన్నకి స్టంట్ పడింది అంటావ్. పెళ్ళి చేసుకునే మెంటల్ స్టేట్‌లో నేను లేను. ఏం చేద్దాం?" అన్నాడు.

నేను అతని మొండితనానికి తల వంచాను.

లేచి నా పర్స్ చేతిలోకి తీసుకున్నాను.

"రిషీ నువ్వు అంటే నాకు చాలా ఇష్టం. కానీ నువ్వు చెప్తున్న ఎమోషన్స్, బైండింగ్స్, డిపెండెన్సీలు అంటే భయం" అన్నాడు.

"నేను మోసపోయాను" అన్నాను బాధగా.

"ఆ సెల్ఫ్ పిటీ మానుకో. హాయిగా వున్నావ్" అన్నాడు.

"నేనీ అవమానం ఆశాభంగం భరించలేక ఏ అఘాయిత్యం అయినా చేసుకుంటానని నీకు అనిపించడంలేదా ద్వారకా?" అన్నాను.

"మరీ నా జడ్జిమెంట్‌ని అంత ఇన్‌సల్ట్ చెయ్యకు. రిషి అంత బలహీనమైన ఆడపిల్ల కాదు" అన్నాడు.

"ఈ వత్తిడిలో ఏ సోమేశ్వరరావునో నేను పెద్దలు చెప్పినట్లు పెళ్ళాడేస్తేనో?" అన్నాను.

"ప్రతి రాత్రీ నన్ను తలుచుకుంటూ, అతనితో కాపురం చెయ్యడం బావుంటుందా? నీ ఇష్టం. నేనేం చెప్పలేను" అన్నాడు.

"నువ్వు మాత్రం నన్ను మరిచిపోయి, ఏడాదికల్లా, నీ కండీషన్స్‌కి ఒప్పుకునే ఇంకో అమ్మాయితో రిలేషన్ ఏర్పరుచుకుంటావు కదూ" కన్నీళ్ళు ఆపుకుంటూ అడిగాను.

కాసేపు తదేకంగా నా మొహాన్ని చూసి, ఆ తర్వాత ఆకాశాన్ని చూసి, "ఏమో అయినా నీకు ఇష్టంలేనప్పుడు నేనెట్లా పోతే నీకెందుకు?" అన్నాడు.

పార్వతితో దేవదాసు ఇట్లా అనలేదు.

"నీలాంటిది దొరికితే చూద్దాం" అన్నాడు.

"నావంటిదా? ఎక్కడుంటుందీ?" అంది గొప్ప భరోసాగా పార్వతి.

ఆ భరోసా నాలో కొరవడింది. సమస్త పురుష జాతిమీదా నాకు నమ్మకం తక్కువ.

నేనొచ్చేసాను.

అతను మర్యాదకైనా నేనొచ్చి దింపనా? మీ నాన్నని చూడనా? అనలేదు.

'ఏల సలిలంబు పారు? గాడ్పేలి విసురు..

ఏల నా హృదయము ప్రేమించు నిన్ను?"

ఆ రాత్రి నాపాలిట కాళరాత్రి అయింది. అతన్ని నేను అసహ్యించుకునేపాటి శక్తి కూడా నాలో మిగిలిలేదు. అంత ప్రేమించానని అర్థమైంది.

నేనూ నా పాతభావాలూ, విరహ కవిత్వాలూ, కీట్సూ, కృష్ణశాస్త్రీ, శరత్‌చంద్ర చటర్జీ.. అందరూ నన్ను మోసం చేసారు. అసలు ఇంత భరింప శక్యంకాని ప్రేమొకటి లోకంలో వుంటుందని ఈ సాహిత్యం నాకెందుకు చెప్పాలి? నేనెందుకు ఆ ట్రాప్‌లో పడాలి? ఆ మోహజాలంలో వున్న నాకు ఇతనింత అనురాగ రహితంగా ఎందుకు ఎదురుపడాలి? 'నేనింతే' అని చెప్తున్నా, నేనెందుకు అతన్ని నమ్మాలి? అతనితో నా మిగిలిన జీవన ప్రయాణం స్థిరమనుకుని సామాన్లు సర్దుకున్న నేను నా ట్రెయిన్ కాన్సిల్ అయిందనీ, ఇంక అసలు ఎప్పటికీ రానేరాదనీ తెలిసి హతాశురాలినయ్యాను.

నీకూ నాకూ కుదరదు నేను కావాలంటే ఒక రూమ్ మేట్‌లా కలిసి వుండు...బట్ ఎప్పటికీ నా సుఖదుఃఖాలు నీతో షేర్ చేసుకోను. స్ట్రేంజర్స్‌లా వుందాం" అంటే ఎలా ఒప్పుకోను?

నేను రాయని ప్రేమలేఖని, నా కన్నీళ్ళు తుడిచేసాయి.

వెన్నెల నిశ్శబ్దంగా చూస్తోంది.

ఎన్ని హృదయాల విస్ఫోటనాలకి సాక్షిగా వుందో? ఆ చంద్రుడు ఎంతమంది విరహిణుల మనసులని కాల్చి, ఆ మచ్చలని తను పూసుకున్నాడో? ఫోన్ మోగుతుందేమో.. సారీరా.. నేను నిన్ను ఆటపట్టించాను.. నువ్వు లేకుండా నేనుండలేను వచ్చేసెయ్" అంటాడనే వెర్రి భ్రమ నాకు నిద్రపట్టనీయలేదు.

ఎక్కడో తీతువు కూస్తోంది.

ఆకాశంలో ఆఖరి చుక్కకూడా పక్క దులుపుకుని 'నీ ఖర్మ నీద'ని కిందకి రాలిపోయింది.

బుగ్గలమీద కన్నీటి చారల ముద్రలు పడ్డాయి.

దోశ పొట్లంలా చుట్టిన పేపర్‌ని లాఘవంగా గేట్ మీదనుండి వరండాలో వున్న ఉయ్యాలబల్లమీద పడేట్లు విసిరిపోయాడు పేపర్ బోయ్.

గోడలమీదనుండి జలపాతాల్లా క్రిందకి దూకుతున్న క్రీపర్స్ వంగపూరంగు పువ్వులతో కళకళలాడుతున్నాయి.

లోకం అంతా ఎం ఎరగనట్లే తన పనిలో తానుంది. కోయిల ఒకత్తి ఏ పనీ లేనట్టు ఒకటే కూస్తోంది.

నేను పేపర్ చేతిలోకి తీసుకుని, వాంటెడ్ కాలమ్స్ చూస్తున్నాను.

ఇలాంటి రోజు మళ్ళీ మళ్ళీ వస్తూనే వుంటుంది నా జీవితంలో అనుకోలేదు. టీచర్ ఉద్యోగాలకి సహనం కావాలి. ఆస్పత్రి ఉద్యోగాలు అసలే వద్దు. ఒక అనుభవం అయింది. ఇలా చూస్తుండగా హనీష్‌గాడు ఫోన్ చేసాడు.

"హలో" అన్నాను నీరసంగా.

"నువ్వు అక్కడ ఉద్ధరించింది చాలుగానీ నీ సామాన్లు సర్దుకో. ప్రయాణం అవుదువుగాని" అన్నాడు.

"నా ట్రయిన్ కాన్సిల్ అయిందిరా" నిర్వేదంగా అన్నాను.

"ట్రెయిన్స్ అంతే! ఫ్లయిట్‌లో రా .. ఎప్పటినుండో అమెరికాకి నిన్ను పంపలేదని నాన్నమీద అలుగుతున్నావ్‌గా. క్రాష్ కోర్స్. స్క్రీన్ అండ్ స్క్రిప్ట్ రైటింగ్ కోర్స్ చేద్దువుగాని. నీకో అప్లికేషన్ తెచ్చాను. వాళ్ళేమో నీ లింక్‌డిన్ ప్రొఫైల్‌లో లిటరరీ ప్రైజ్‌లు చూసి సీట్ ఇస్తాం అన్నారు. నువ్వు వీసాకెళ్ళు. మిగతాది నేను చూసుకుంటాలే. జాబ్ వచ్చిందిగా" అన్నాడు.

"ఏంట్రా నువ్వనేది?" అన్నాను.

"చూడు మూడు నెలలు టైం వుంది. త్వరగా రెడీ అవు. నేను నాన్నతో మాట్లడాలి, బై" అని ఫోన్ పెట్టేసాడు.

బామ్మ రామకోటిలోంచి తలెత్తి "ఎవరే ఫోన్‌లో?" అంది.

"మీ ఆయన.. హనుమంతరావుగారు..."

"ఆ?"

"అదే హనీష్‌గాడు" అన్నాను.

"ఏవంటాడూ?"

నేను జవాబు చెప్పేలోగనే లోపలనుండి అమ్మ వచ్చి "నాన్న పిలుస్తున్నారు నిన్ను" అని చెప్పి వెళ్ళింది.

"ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ఎవరూహించెదరూ?"

యాషీ, నేనూ, నైనా బ్రీజర్ ఓపెన్ చేసాం.

"ఇంతకీ నిన్ను పాత చింతకాయ పచ్చడి అన్నాడంటావ్" అంది నైనా.

"అసలు నువ్వు చాలా మోడ్రన్ అనే కదే మా అందరి అభిప్రాయం? అలా అనేసాడేంటీ?" అంది.

నైనా నా హెయిర్ చూసి "ఇంత పొట్టిగా కట్ చేసుకున్నా అలా అన్నాడా?" అంది.

"హెయిర్ కాదు, నా భావాలు, నా ఇష్టాలు, నా అభిరుచులు అతనికి ఓల్డ్ స్కూల్‌లా అనిపించాయిట" అన్నాను ఉక్రోషంగా.

"అయితే అతన్ని మరిచిపో హాయిగా సోమేశ్వరరావు సంబంధం చేసుకో. సివిల్ సర్వీసెస్ అన్నావుగా" అంది యాషిక.

"ఏ సర్వీసెసో తెలీదు కానీ, నేను అమెరికా వెళ్ళి చదువుకుందాం అనుకుంటున్నా" అన్నాను.

"మళ్ళీ అమెరికా ఎందుకే? ఈసారి ఏ విల్‌గేట్సో, స్టీవ్ వేవో తగిలితేనో.." అంది.

"ఒకవేళ ఏ అమెరికెనో తగిలి ద్వారక అడిగినవే అడిగి, లివిన్‌లో వుందాం అంటే నీకు ఏ అభ్యంతరం వుండదు. పైగా వాళ్ళ దేశాల్లో అంతే, అని సర్ది చెప్పుకుంటావ్ మనసుకి కదూ!" అంది నైనా.

నేను బ్రీజర్ కింద పెట్టి ఆలోచనగా చూసి "పాయింటేనే. ద్వారక ఇండియన్ కాబట్టి నా అభ్యంతరాలూ ఎక్స్‌పెక్టేషన్స్‌నూ" అన్నాను.

" అమెరికన్‌ని చూసుకో అయితే" అంది యాషిక.

నా మొహం సీరియస్‌గా మారింది. అతను నన్ను చేసిన అనుమానం మళ్ళీ గుర్తొచ్చింది "నేను మా అమ్మమ్మల కాలలోనే ఆగిపోయానుట" అన్నాను.

"అతన్ని ఇలా వదిలేస్తేకాదు. నువ్వు ప్రతీకారం తీర్చుకోవాలి" అంది యాషిక.

"అవునే. నువ్వు అమెరికా వెళ్ళి, ఏ స్టీవ్ బ్రేవ్‌తోనో లివింగ్ రిలేషన్‌లో వున్నానని అతనికి చూపించాలి" అంది నైనా.

"ఇది అమ్మాయిల శపథం సినిమా కాదు. నా జీవితం" విసుగ్గా అన్నాను.

"ఇంతకీ నీ చదువెక్కడా?" అంది యాషి.

"లాస్ ఏంజల్స్ లో"

"మీ నాన్న ఏమన్నారూ?" నైనా అడిగింది.

"ఈ కొరివి కొన్నాళ్ళు దూరంగా వుంటేనే బెటర్ అనుకుంటున్నారు కాబోలు వెళ్ళమన్నారు" అన్నాను.

"మరి మీ అమ్మ?" అడిగింది యాషిక.

"పొద్దుట ఆకుకూరలమ్మాయితో, కూరలు కొంటూ సోమేశ్వరావులకీ, పిచ్చేశ్వరావులకి కూడా సంబంధాలు కుదిరిపోతున్నాయి. ఏమే లచ్చీ నీ ఎరికలో సంబంధాలుంటే చెప్పు. పేరు మాత్రం బావుండాలి స్టైలుగా" అని నా మీద సెటైర్‌లు వేస్తోంది" అన్నాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS